ANDHRAJYOTHY

5



# అనకాపల్లి

జిల్లా వార్తలు

సోమవారం 14 జూలై 2025

# గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డే లేదు

- గత వైసీపీ ప్రభుత్వంలో చెలరేగిపోయిన అక్రమార్కులు
- కూటమి ప్రభుత్వం వచ్చినా మార్పు లేదు
- యథేచ్ఛగా తవ్వి తరలించేస్తున్నా పట్టించుకోని అధికారులు

సబ్బవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలకు అడ్డే లేకుండా ఉంది. గత వైసీపీ ప్రభుత్వంలో చెలరేగిపోయిన అక్రమార్కులు కూటమి ప్రభుత్వం వచ్చినా తగ్గడం లేదు. ఇటీవల అంతకాపల్లి, గాలిభీమవరం గ్రామాల పరిధిలో యథేచ్ఛగా రేయింబవళ్లు గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.



గాలిభీమవరం రెవెన్యూ పరిధిలో ములకల కొండవాలు ప్రాంతంలో అక్రమంగా తవ్వేస్తున్న ఆనవాళ్లు

మండలంలోని అంతకాపల్లి, గాలిభీమవరం గ్రామాల పరిధిలో ఇటీవల గ్రావెల్ అక్రమ తవ్వకాలు పెరిగిపోయాయి. గాలిభీమవరం సర్వే నంబరు 134లో ములకల కొండ ఉంది. ఈ కొండ చుట్టూ గతంలో జగనన్న కాలనీకి ఇళ్లు మంజూరు చేశారు. అప్పటి నుంచి కొండ చుట్టూ తవ్వకాలు జరుగుతున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అక్రమార్కులకు అడ్డుకట్ట పడుతుందని అందరూ ఆశించారు. అయితే ఏమాత్రం మార్పు లేదు. ఇటీవల కొండకు దక్షిణ భాగంలో కొండవాలు ప్రాంతాన్ని కలుపుకొని రైల్వే లైన్‌కు గతంలో స్థలం కేటాయించారు. ఆ స్థలంలో కూడా గ్రావెల్ తవ్వేశారు. అక్కడ ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో కూడా అక్రమార్కులు గ్రావెల్‌ను తవ్వుకుపోయారు. అనకపల్లి, గాలి భీమవరం, దేవీపురం, అంతకాపల్లి, గొల్లపాలెం, రాయపుఅగ్రహారం, పైడివాడ అగ్రహారం, గుల్లేపల్లి, ఎల్లుప్పి, తదితర గ్రామాల్లో మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి.

### ఇళ్ల బేస్‌మెంట్ల వరకు తవ్వకాలు

గత వారం రోజులు నుంచి నంగినారపాడు రెవెన్యూ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ(జగనన్న కాలనీ) లేఅవుట్‌ను ధ్వంసం చేసి మట్టిని తరలించేస్తున్నారు. దీంతో గతంలో ఇళ్ల నిర్మాణానికి ఏర్పాటు చేసిన బేస్‌మెంట్లు గాల్లో వేలాడుతున్నాయి. అక్కడ ఇళ్ల నిర్మాణానికి పనికి రాకుండా చేసేశారు. దాదాపు 20 నుంచి 30 ప్లాట్ల బేస్‌మెంట్లు ఇదే పరిస్థితిలో ఉన్నాయి.

### అంతకాపల్లి రెవెన్యూ పరిధిలో..

అంతకాపల్లి రెవెన్యూ పరిధి ఒమ్మవాని పాలెం సమీపంలో ప్రభుత్వ భూమిలో పట్టపగలే ఎక్స్‌కవేటర్లతో గ్రావెల్‌ను అక్రమంగా తవ్వేస్తున్నారు. ఈ గ్రావెల్‌ను కోటపాడు రోడ్డు నుంచి అయ్యన్నపాలెం, గుల్లేపల్లి మీదుగా తరలించేస్తున్నారు. ఇటీవల అధికారులు అసకపల్లిలో కట్టడి చేస్తే దేవీపురంలో తవ్వకాలు మొదలు పెట్టారు. దేవీపురం నుంచి బలిజపాలెం మీదుగా గ్రావెల్ తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. డిమాండ్, దూరాన్ని బట్టి డంపర్ గ్రావెల్‌ను రూ.6 నుంచి రూ.8 వేలకు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గట్టి నిఘా పెట్టి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.



జీవీఎంసీ 88వ వార్డు పరిధి నంగినారపాడు రెవెన్యూ పరిధిలో ఎన్టీఆర్ కాలనీ (జగనన్న కాలనీ)లో బేస్‌మెంట్ వరకు తవ్వేసిన దృశ్యం

## నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి



బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



విశేష అలంకరణలో నూకాంబిక అమ్మవారు

స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తులు కుటుంబాల సమేతంగా అమ్మవారి దర్శనానికి వచ్చి ఆలయ ఆవరణతో పాటు చుట్టుపక్కల తోటల్లో వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చే జాతీయ రహదారి, పూల్‌బాగ్ రోడ్డు, గవరపాలెం తదితర మార్గాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో కె.ఎల్.సుధారాణి, సిబ్బంది చర్యలు చేపట్టారు.

- అనకాపల్లి టౌన్/ఆంధ్రజ్యోతి

# సదరం సర్టిఫికెట్ల పరిశీలనలో దళారుల దందా

వైకల్యం లేకున్నా ఉన్నట్టుగా ధ్రువీకరణ

- అనకాపల్లి కేంద్రంగా వ్యవహారం
- బోగస్ దివ్యాంగ పింఛన్లను ఏరివేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు



చోడవరం, జూలై 13(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో చోటా నాయకులు గ్రామాల్లో విచ్చలవిడిగా కొందరికి సదరం సర్టిఫికెట్లు ఇప్పించి దివ్యాంగ పింఛన్లు మంజూరు చేయించారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం బోగస్ పింఛన్లను ఏరివేయాలని నిర్ణయించి సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయిస్తోంది. దీనిని దళారులు తమకు అనుకూలంగా మార్చుకుని డబ్బులు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. అనకాపల్లి కేంద్రంగా ఈ దందా కొనసాగుతోంది.

ఎటువంటి శారీరక, మానసిక లోపం లేకపోయినా గత వైసీపీ ప్రభుత్వంలో కొందరికి చోటా నాయకులు డాక్టర్లపై ఒత్తిడి తెచ్చి సదరం సర్టిఫికెట్లను ఇప్పించారు. నకిలీ దివ్యాంగ పింఛనుదారులను గుర్తించి వారి సర్టిఫికెట్లను రద్దు చేయాలని గతంలోనే దివ్యాంగుల సంఘం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం బోగస్ దివ్యాంగ పింఛనుదారుల ఏరివేత కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా సదరం శిబిరాలను నిర్వహించి సదరం సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టింది. దివ్యాంగుల వైకల్యం నిర్ధారించేందుకు గ్రామ పంచాయతీల వారీగా పింఛనుదారులను ఆస్పత్రికి పిలిచి సంబంధిత వైద్య నిపుణులతో మరో సారి తనిఖీలు నిర్వహిస్తోంది. ఇదే అదునుగా దళారులు రంగ ప్రవేశం చేశారు. సదరం సర్టిఫికెట్లకు ఆమోద ముద్ర వేయిస్తామని బోగస్ దివ్యాంగ పింఛనుదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు.

### అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో తంతు

అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న సదరం ... మిగతా 6వ పేజీలో

## కుమ్మేసిన వాన



కేఆర్ఎం కాలనీలో వర్షపు నీటి ప్రవాహానికి కొట్టుకుపోతున్న ద్విచక్ర వాహనం

- విశాఖలో భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- కేఆర్ఎం కాలనీలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన రెండు ద్విచక్ర వాహనాలు

విశాఖపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఆదివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండగా..



రైల్వే స్టేషన్ రోడ్డు జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

ఆ తరువాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై సుమారు గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రైల్వే స్టేషన్ రోడ్డులో నీటి ప్రవాహం వల్ల ... మిగతా 6వ పేజీలో

# నిధుల సమాచారం ఇవ్వకపోవడం తప్పే..

బిల్లుల పెండింగ్‌తో జడ్పీటీసీ సభ్యుల్లో కొంత అసంతృప్తి

- ఆర్థిక సంఘం నిధుల గురించి సమావేశంలో కాకుండా నేరుగా అడిగితే బాగుండేది
- ఇకపై ఒకేరోజు సాధారణ, స్టాండింగ్ సమావేశాలను నిర్వహించం
- నాపై అవిశ్వాసం పెడతారన్నది అవాస్తవం
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

విశాఖపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను మండలాలకు కేటాయించే సమాచారం జడ్పీటీసీ సభ్యులకు ఎప్పటికప్పుడు చెప్పకపోవడం పొరపాటేనని జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అంగీకరించారు. అలాగే సాధారణ నిధులతో చేపట్టిన పనులకు సుమారు రూ.8 కోట్ల వరకు వరకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో జడ్పీటీసీ సభ్యుల్లో కొంతవరకు అసంతృప్తి నెలకొందన్నారు. అంతకుమించి జడ్పీటీసీ సభ్యుల మధ్య భేదాభిప్రాయాలు లేవని ఆమె స్పష్టం చేశారు. ఆదివారం తన బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుభద్ర మాట్లాడుతూ తనకు, జడ్పీటీసీ సభ్యులకు మధ్య వివాదం పట్ల కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, 20 మంది వరకు సభ్యులు తనను వ్యతిరేకిస్తున్నారంటూ వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. అయితే జడ్పీకి సంబంధించి నిధుల కేటాయింపు, ఇతర అంశాలపై సభ్యులకు సమాచారం ఇవ్వడంలో కొంత గ్యాప్ చోటుచేసుకుందన్నారు.

ఏటా ఆర్థిక సంఘం నిధుల నుంచి ప్రతి జడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యేలకు రూ.20 లక్షల నిధులను కేటాయిస్తున్నామన్నారు. అయితే ఇంకా మిగిలిన నిధులు మండలాల్లో పలు అభివృద్ధి పనులకు కేటాయించేటప్పుడు సంబంధిత జడ్పీటీసీ సభ్యులకు సమాచారం ఇవ్వని విషయం వాస్తవమేన్నారు. దీనిపై సభ్యులు జడ్పీ సమావేశంలో కాకుండా తనను కలిసినప్పుడు అడిగితే బాగుండేదని అభిప్రాయపడ్డారు.



విలేకరులతో మాట్లాడుతున్న సుభద్ర

జడ్పీ సాధారణ సమావేశం, స్టాండింగ్ కమిటీ సమావేశం ఒకేరోజు ఏర్పాటు చేయడంపై కొందరు సభ్యులు వ్యతిరేకించారని, ఈ కారణంతోనే ఈ నెల 9న జరిగిన రెండు సమావేశాలను బాయ్‌కాట్ చేస్తున్నట్టు సభ్యులు తనకు ముందే చెప్పారన్నారు. భవిష్యత్తులో ఇక రెండు సమావేశాలు ఒకేరోజు నిర్వహించబోమని సుభద్ర స్పష్టం చేశారు. తనపై అవిశ్వాసం ప్రవేశపెడతారన్న వస్తున్న వదంతుల్లో వాస్తవం లేదన్నారు. గత ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు సాధారణ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, ఇదికూడా సభ్యుల్లో అసంతృప్తికి ఒక కారణమన్నారు. జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు 16 నెలలుగా గౌరవ వేతనాలు బకాయి ఉందని ... మిగతా 6వ పేజీలో

# వాన జాడ లేకపాయె!

వర్షాలు లేక ఎండిపోతున్న వరి నారు

- బిందెలతో నీళ్లు తెచ్చి తడుపుకోవలసిన దుస్థితి
- అవస్థలు పడుతున్న రైతులు
- కల్యాణపులోవ రిజర్వాయర్ కింద కూడా అదే పరిస్థితి

రావికమతం, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వరి సాగు రైతులకు కష్టాలు తప్పడం లేదు. గత రెండు వారాలకు పైగా వర్షాలు కురవకపోవడంతో దిగులు చెందుతున్నారు. వరి విత్తనాలు వేసి మొలకొచ్చి ఎదిగే సమయంలో వర్షాలు కురవక నారు మడులు ఎండిపోతున్నాయి.

ఈ ఏడాది మండలంలో 2,181 హెక్టార్లలో రైతులు వరి సాగుకు సిద్ధమయ్యారు. గత ఏడాది వరి బాగానే పండినప్పటికీ కోతల సమయంలో వర్షాలు పడి తడిసిపోవడంతో రైతులు సొంతంగా విత్తనాలు సిద్ధం చేసుకోలేకపోయారు. దీంతో అప్పులు చేసి ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు వరి విత్తనాలు కొనుగోలు చేసి నారు పోశారు. నారు పోసిన నాటి నుంచి వర్షాలు పడలేదు. భూమిలో తేమకు వేసిన విత్తనాలు మొలకొచ్చి నారు ఎదిగే సమయంలో వర్షాలు వెనకడుగు వేయడంతో నారు మడులు నర్రలు వారాయి.



ఐదు వందల ఎకరాలకు సాగునీరు అందించే కొమిర రామరాజు చెరువులో చుక్క నీరు లేని దృశ్యం



కవ్వగుంట పొలాల్లో బీటలు వారి ఎండిపోతున్న వరి నారును బకెట్లతో నీళ్లు తెచ్చి తడుపుతున్న రైతు

జూన్ నెలలో అడపాదడపా వర్షాలే తప్ప చెరువులు, బావులు, వాగులు నిండే విధంగా ఏనాడూ వర్షం కురవలేదు. దీంతో వరినారు మడులు బీటలు వారి ఎండిపోతున్నాయి. వర్షం పడుతుందన్న ఆశతో రైతులు ఎదురు చూస్తున్నా ఫలితం లేదు. రోజురోజుకు ఎండల తీవ్రత పెరిగి నారు మడులు ఎండిపోతున్నాయి. నీటి వనరులు అందుబాటులో ఉన్న చోట తడులు చేస్తుండగా, లేని చోట కనీసం ఇంజన్లతో తడిపేందుకు నీరు లేక దూర ప్రాంతాలకు వెళ్లి బోర్లు ఉన్న చోట నుంచి బిందెలతో, ఆటోల్లో ప్లాస్టిక్ డ్రమ్‌లతో నీళ్లు తెచ్చి నారుమడులను తడుపుతున్నారు.

కల్యాణపులోవ రిజర్వాయరు కింద కూడా నీరు లేక నారు మడులు తడుపుతున్నారు. రిజర్వాయర్‌లో 460 అడుగుల సామర్థ్యానికి గాను ప్రస్తుతం 451.04 అడుగుల మేర నీటి నిల్వలు ఉన్నాయి. ఈ ఏడాది రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో ఆశించినంత వర్షాలు పడక ఇన్‌ఫ్లో రిజర్వాయర్‌లోకి రాక నీటి సామర్థ్యం పెరగలేదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి 454 అడుగుల మేర నీటి నిల్వలు ఉండేవని, ప్రస్తుతం ఉన్న నీరు రెండు వేల ఎకరాలకే దమ్ములకు సరిపోతుందని, అది నారుమడులకు ఇవ్వాల్సి వస్తే 1500 ఎకరాలకే దమ్ములకు సరిపోతుందని కల్యాణపులోవ ఏఈ డి.సూర్య తెలిపారు. పెద్దేరు జలాశయం నీరు తమ ఆయకట్టుకు వచ్చే కాలువ మరమ్మతులు చేస్తున్నందున నీరు రాదని కవ్వగుంట రైతులు వాపోతున్నారు.



కొత్త లోసింగి నుంచి డోలీపై గర్భిణిని తీసుకువస్తున్న దృశ్యం

## గర్భిణికి తప్పని డోలీ మోత

నాలుగు కిలోమీటర్లు మోసుకెళ్లాల్సిన దుస్థితి

- మార్గమధ్యంలో ప్రసవం
- కొత్త లోసింగికి రహదారి సౌకర్యం లేక ఇక్కట్లు

రోలుగుంట, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్ల పంచాయతీ శివారు కొండ శిఖర గ్రామమైన కొత్త లోసింగికి రహదారి సౌకర్యం లేక రోగులకు డోలీ మోతలు తప్పడం లేదు. ఇదే విధంగా ఆదివారం ఉదయం ఓ గర్భిణిని నాలుగు కిలోమీటర్ల మేర డోలీలో తరలించాల్సి వచ్చింది. అంబులెన్స్ రావడం ఆలస్యం కావడంతో మార్గమధ్యంలోనే ఆమె ప్రసవించింది.

రోలుగుంట మండలం అర్ల పంచాయతీ శివారు కొండ శిఖర గ్రామమైన లోసింగిలో పీవీటీజీ తెగకు చెందిన 70 కుటుంబాలకు చెందిన 290 మంది జనాభా నివసిస్తున్నారు. కొత్త లోసింగికి చెందిన పాంగి సాయి(22) అనే గర్భిణికి రెండవ కాన్పులో భాగంగా ... మిగతా 6వ పేజీలో

# ఘనంగా అమ్మవార్ల జాతర

▸▸ భక్తులతో కిటకిటలాడిన యానాద్రి, పొలిమేరమ్మల ఆలయాలు



యానాద్రి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఎలమంచిలి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కాలనీలో యానాద్రి అమ్మవారి జాతర, రామారాయుడుపాలెంలో పొలిమేరమ్మ జాతరలను ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌తో పాటు కూటమి నాయకులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఎటుచూసినా కోలాహల వాతావరణం నెలకొంది. సాయంత్రం ఆలయాల వద్ద మహిళల కోలాటాలు, భజనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మహిళల కోలాటం

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

▸▸ బ్రాండిక్స్ ఆధ్వర్యంలో నిర్వహణ ▸▸ 500 మందికి పరీక్షలు




కంటి రోగులకు పరీక్షలు జరుపుతున్న వైద్య సిబ్బంది

అచ్యుతాపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ నిర్వహించిన 140వ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 700 మంది కంటి రోగులు హాజరుకాగా, వైద్య సిబ్బంది ఐదు వందల మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 56 మందికి కంటికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరికి తాము విశాఖలో గల శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి తెలిపారు. అనంతరం 294 మందికి ఉచితంగా కంటి అద్దాలు, 150 మందికి మందులు పంపిణీ చేశారు. శిబిరానికి విచ్చేసిన వారందరికీ మజ్జిగ, పులిహోరతో పాటు మధ్యాహ్న భోజనం అందించారు.

# సర్కారు బడి.. విజయాల గుడి

▸▸ తులసీనగర్ జడ్పీ హైస్కూల్ ప్లస్‌లో ఉత్తమ ఫలితాలు ▸▸ ఒకే ఏడాది ఎనిమిది మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులు సౌగంధిక, వైష్ణవి, భవ్యశ్రీ, లక్ష్మీవర్ధిని

ఎలమంచిలి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా ఒకే ఏడాది ఎనిమిది మంది పేద విద్యార్థినులను ట్రిపుల్ ఐటీకి పంపించి జిల్లాలోనే ఎంతో ఘనత సాధించింది ఎలమంచిలిలోని తులసీనగర్‌లో గల జడ్పీ హైస్కూల్ ప్లస్. ఈ పాఠశాల నుంచి ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడంతో పాటు ఎనిమిది మంది విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం విశేషం. అరకొర వసతులతో ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినులు ఇంతటి ఘనత సాధించడం వెనుక ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందని చెప్పవచ్చు. ఈ స్కూల్ నుంచి 2024-25 విద్యా సంవత్సరంలో 147 మంది విద్యార్థినులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా, వీరిలో 145 మంది మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణులయ్యారు. వీరిలో పి.సౌగంధిక 589, డి.వైష్ణవి 580, పి.భవ్యశ్రీ 577 మార్కులు సాధించారు. వీరితో పాటు మరికొంత మందికి అధిక మార్కులు సాధించారు. వీరిలో ఎనిమిది మంది ట్రిపుల్ ఐటీలో స్థానం దక్కించుకున్నారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారిలో దిగుమర్తి వైష్ణవి, పీవీడీ వర్షిణి, పి.భవ్యశ్రీ, ఎ.లక్ష్మీవర్ధిని, పి.మౌళిక, పి.సౌగంధి, మడగల భార్గవి, జి.భాగ్యశ్రీలు ఉన్నట్టు హెచ్‌ఎం తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లోనే ఒక్కప్పుడు మంచి ఫలితాలు సాధించేవారని, ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో అంతకు మంచి ఉత్తీర్ణత శాతం సాధిస్తుండడం విశేషమని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లో మరిన్ని వసతులు కల్పించి, పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటే మరిన్ని విజయాలను సర్కారు బడుల విద్యార్థులు సొంతం చేసుకోగలరని అంటున్నారు.

## పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ కృషి



పాడి రైతులకు బేసిన్లు అందిస్తున్న అధ్యక్షుడు సత్యనారాయణ

మునగపాక, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపేట సొసైటీ అధ్యక్షుడు మొల్లేటి సత్యనారాయణ అన్నారు. మండలంలో మంగళవరపుపేట పాల ఉత్పత్తిదారుల సంఘ భవనం ఆవరణలో ఆదివారం రైతులకు దాణా బేసిన్లతో పాటు స్టీల్ క్యాన్లను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆడారి త్రిమూర్తులు, సొసైటీ డైరెక్టర్లు యల్లపు రాము, గనిరెడ్డి రాములమ్మ, ఆడారి వెంకటలక్ష్మి, భీశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 'స్మార్ట్ విద్యుత్ మీటర్లను అడ్డుకోండి'




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి ) : స్మార్ట్ విద్యుత్ మీటర్లను ప్రజలంతా అడ్డుకోవాలని సీపీఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. అదానీ కంపెనీలకు లాభాలు చేకూర్చి ప్రజలపై విద్యుత్ భారాలు మోపేందుకు ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. విద్యుత్ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు మోదీ ప్రభుత్వం తీసుకు వచ్చిన విద్యుత్ సంస్కరణలను గత వైసీపీ ప్రభుత్వం అమలు చేసిందని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యతిరేకించిన నేటి పాలకులు ప్రజలపై ఇటువంటి భారాలు మోపుతుంటే మాట్లాడరేం అని ప్రశ్నించారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడు నాయుడు, నాయకులు చందక రామకృష్ణ, ఎన్.నారాయణరావు, రుత్తల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

▸▸ మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం

మునగపాక, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం దళితుల హక్కులను, పథకాలను పక్కన పెట్టిందని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం ఆరోపించారు. మండల కేంద్రం మునగపాకలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల పూర్తిస్థాయి అమలుకు కూటమి ప్రభుత్వ కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్నట్టు చెప్పారు. అనంతరం పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు దాడి శివ, తంబారికి సాంబశివ తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న నాగభూషణం

## నునపర్తిలో పసలమారెమ్మ పండుగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అచ్యుతాపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నునపర్తిలో ఆదివారం పసలమారెమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి నగేష్, గొంప నరసింహనాయుడు, రెడ్డి అప్పారావు, కన్నూరు ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు

### బెల్టుషాపు నిర్వహిస్తున్న ఇద్దరి అరెస్టు

అచ్యుతాపురం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఎంజేపురం, ఉప్పవరంలలో మద్యం షాపుపై ఆదివారం దాడిచేసి ఇద్దరి అదుపులోకి తీసుకున్నామని సీఐ నమ్మి గణేష్, ఎస్ఐ సుధాకరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంజేపురంలో ఆరు, ఉప్పవరంలో తొమ్మిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ప్రభుత్వ పింఛనర్ల ధర్నా రేపు

అనకాపల్లి టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నెహ్రూ చౌక్‌లో రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ మంగళవారం ధర్నా నిర్వహించనున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డాది జగన్నాథరావు తెలిపారు. పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న ఈ ఆందోళన కార్యక్రమానికి పింఛనర్లు అంతా హాజరై విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

### బీరు బాటిళ్లు తరలిస్తున్న మహిళపై కేసు నమోదు

కశింకోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విస్సన్నపేట గ్రామ శివారులో బీరు బాటిళ్లు తరలిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బంది ఆదివారం మాటు వేయగా, గ్రామానికి చెందిన సింగంశెట్టి ఆదిలక్ష్మి ఎనిమిది బీరు బాటిళ్లను తెల్లని గోనె సంచిలో తీసుకువస్తుండగా అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## కుమ్మేసిన వాన

... 5వ పేజీ తరువాయి

వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సీతమ్మధారలోని కేఆర్‌ఎం కాలనీలో మోకాలు లోతులో నీరు ప్రవహించింది. నీటి ప్రవాహ ధాటికి రోడ్లపై పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు కొట్టుకు పోయాయి. ఇవి వర్షంలో కొట్టుకుపోతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. సీతమ్మధారలో 34 మి.మీ., ధారపాలెంలో 24 మి.మీ. వర్షపాతం నమోదైంది.

## రూ.12.43 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న మంత్రి

నక్కపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగిత గ్రామానికి చెందిన దేవవరపు గోవింద్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. హోం మంత్రి అనిత తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఈ చెక్కు అందజేశారు. ఏడాదిన్నర క్రితం కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్న గోవింద్, తనను ఆదుకోవాలని మంత్రి అనితను కోరారు. గోవింద్ ఆపరేషన్, ఆస్పత్రి ఖర్చులకు సంబంధించిన ఫైలును మంత్రి ప్రభుత్వానికి సిఫారసు చేయగా, కాలేయ మార్పిడి ఖర్చులో 36 శాతం ఆర్థిక సాయం రూ.12.43 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, నాయకులు అడపా గణేశ్, గుండిబిల్లి గోవింద్, ఉమామహేశ్వరరావు, సత్తిబాబు, అప్పారావు, పి.గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి కేరాఫ్ సీఎం చంద్రబాబు

▸▸ టీడీపీ మండల అధ్యక్షుడు లింగంనాయుడు



పాములవాకలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందిస్తున్న నాయకులు

కోటవురట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ సీఎం చంద్రబాబు అని టీడీపీ మండల అధ్యక్షుడు పెట్ల లింగంనాయుడు అన్నారు. మండలంలోని పాములవాక గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లింగంనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక మండలంలోని జల్లూరు, పందూరు గ్రామాల్లో రెండు వంతెనలు నిర్మించినట్టు చెప్పారు. పల్లెల్లో ముమ్మరంగా సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. తాండవ కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేసినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ కోటవురట్ల అధ్యక్షుడు వేచలపు జనార్దన్, నాయకులు సుర్ల రామచంద్ర, నానిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాకంబరిగా నూకాంబిక అమ్మవారు



ఎస్. రాయవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నూకాంబిక అమ్మవారిని ఆదివారం కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించారు. అమ్మవారు శాకంబరిగా దర్శనమివ్వడంతో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాకంబరి రూపంలో ఉన్న నూకాంబికను ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, టీడీపీ సీనియర్ నాయకుడు కందుల వెంకటేశ్వరరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేపట్టారు.

# పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

'సుపరిపాలనలో తొలి అడుగు'లో హోం మంత్రి అనిత



రామయ్యపట్నంలో మాట్లాడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత

ఎస్.రాయవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని రామయ్యపట్నం గ్రామంలో ఆదివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మంత్రి అనిత మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని వ్యవస్థలను నాశనం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, ఇచ్చిన మాట ప్రకారం పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు పెన్షన్, ఉచిత గ్యాస్, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు చెప్పారు. అంతేకాకుండా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభిస్తామన్నారు. అలాగే తొందరలోనే నిరుద్యోగ భృతిని కూడా అందించేందుకు సీఎం చంద్రబాబు చూస్తున్నారని మంత్రి తెలిపారు. రామయ్యపట్నం గ్రామ పంచాయతీ నుంచి తీర్మానాలు ఇవ్వకపోవడంతో అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా ఇక్కడ మరో పార్టీ బలపరిచిన సర్పంచ్ ఉండడంతో తీర్మానాలు ఇవ్వలేదన్నారు. రామయ్యపట్నం గ్రామాన్ని అభివృద్ధిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని మంత్రి ప్రకటించారు. పార్టీలకతీతంగా అందరూ తమకు సహకరించాలని కోరారు. అంతకముందు మంత్రికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. తరువాత టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, నియోజవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, మాజీ ఎంపీపీ వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్దం, నాయకులు ఎన్.వెంకటరాజు, అల్లు నరసింహమూర్తి, జి.రామకృష్ణ, ఎ.శాంతి, చంద్రరావు, నాయుడు పాల్గొన్నారు.



ఏడాది పాలనపై ఇంటింట ప్రచారం చేస్తున్న మంత్రి అనిత

## ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ ట్రేడ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈనెల 20వ తేదీలోగా విద్యార్హతలతో పాటు అన్ని రకాల ధ్రువపత్రాలతో పాయకరావుపేటలోని ఐటీఐకి వచ్చి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. అలాగే 21వ తేదీన ధ్రువపత్రాల పరిశీలన చేయించుకోవాలన్నారు. కౌన్సెలింగ్ వివరాల కోసం 70137 37243 లేదా 99894 78278 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

### 31 మద్యం సీసాల స్వాధీనం

నక్కపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చిరాజుపేట గ్రామంలో ఆదివారం ఎస్ఐ సన్నిబాబు నేతృత్వంలో సిబ్బంది మద్యం బెల్టుషాపుపై దాడులు నిర్వహించారు. డి.అనంతరావుకు చెందిన దుకాణంలో 31 మద్యం సీసాలు లభ్యమయ్యాయి. వీటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ సన్నిబాబు చెప్పారు. మద్యం అక్రమంగా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

### మూడు ట్రాకర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

కోటవురట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టివాడ గ్రామంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న మూడు ట్రాకర్లు, మట్టి తవ్వుతున్న ఎక్స్‌కవేటర్‌ను ఆదివారం సీజ్ చేసినట్టు ఎస్ఐ రమేశ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. ఒక భూమిలో మట్టిని ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వి తరలిస్తున్న ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను పట్టుకొని పోలీసుస్టేషన్ తరలించామన్నారు. వాటిని తహసీల్దార్‌కు అప్పగిస్తామని చెప్పారు. అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్, ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా చేసిన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## చెస్ చాంపియన్‌షిప్‌లో శ్రావ్యశ్రీ సత్తా



ట్రోఫీ, జ్ఞాపిక అందుకుంటున్న చెస్ చాంపియన్‌షిప్ విజేత శ్రావ్యశ్రీ

ఎస్.రాయవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన భీమరశెట్టి శ్రావ్యశ్రీ రాష్ట్ర స్థాయి అండర్-15 బాలికల చెస్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటింది. విశాఖలోని బీవీకే కళాశాలలో ఈ నెల 10, 12, 13 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన 99 మంది బాలికలు పోటీ పడ్డారు. శ్రావ్యశ్రీ చక్కని ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచింది. ఈ మేరకు నవంబరులో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరగనున్న జాతీయ స్థాయి అండర్-15 పోటీలకు ఆమె ఎంపికయ్యారు.

### గో ఆధారిత ఉత్పత్తులపై ముగిసిన వర్క్‌షాప్

పాయకరావుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల జువాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన గోఆధారిత ఉత్పత్తులపై వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. రెండో రోజు వర్క్‌షాపులో పాల్గొన్న గో సంరక్షకులు, విద్యార్థులకు గో సేవ సంయోజక్ ఆకుతోట రామారావు, ఆంధ్ర ప్రాంత గో సేవ సంయోజక్ రాంజీ, గోసేవ సహ సంయోజక్ ఓలేటి నారాయణకుమార్ తదితరులు 20 రకాల రకాల గోఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చారు. అలాగే శిక్షణ తీసుకున్న వారితో పలు ఉత్పత్తులను తయారు చేయించారు. వీటిని ప్రదర్శనగా పెట్టారు. కార్యక్రమంలో స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, గోసంరక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గర్భిణికి తప్పని డోలీ మోత

... 5వ పేజీ తరువాయి

ఆదివారం ఉదయం నొప్పులు రావడంతో భర్త సుందరరావు కుటుంబ సభ్యుల సహాయంతో నాలుగు కిలోమీటర్లు డోలీ కట్టించుకుని వైబీపట్నం వరకు తీసుకువచ్చారు. అంబులెన్సు ఆలస్యంగా రావడంతో అక్కడే పాంగి సాయికి మర్రి చెట్టు వద్ద ప్రసవం అయ్యి పాపకు జన్మనిచ్చింది. అనంతరం అంబులెన్సు రావడంతో అక్కడి నుంచి బుచ్చెంపేట పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందిస్తున్నారు. దీంతో తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు.

### మధ్యలో నిలిచిన రహదారి నిర్మాణం

డోలీ మోతలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వైబీపట్నం నుంచి లోసింగి వయా పెదగరువు గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్ నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించారు. అయితే ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదంటూ కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేశారు. అప్పటి వరకు చేసిన పనుల్లో ఇటీవల కురిసిన వర్షాలకు సైడ్ కాలువలు కొట్టుకుపోయాయి. రోడ్డు కూడా అక్కడక్కడ కొట్టుకుపోయింది. దీంతో వాహనాలు వెళ్లే అవకాశం లేకుండాపోయింది. రోగులు, గర్భిణులు అత్యవసరమైతే డోలీలో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే రోడ్డు పనులను పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# నిధుల సమాచారం ఇవ్వకపోవడం తప్పే..

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. అదేవిధంగా టూర్ నిర్వహించాలని జడ్పీటీసీ సభ్యులు కోరుతున్నా పాలకవర్గం ఏర్పాటు నుంచే ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని ఆమె వెల్లడించారు. సభ్యుల్లో నెలకొన్న సందేహాలు, అసంతృప్తి నేపథ్యంలో రెండురోజుల క్రితం తమ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల సమక్షంలో జడ్పీటీసీ సభ్యులతో సమావేశం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించామని, చైర్‌పర్సన్‌గా తన పరిధిలో చేసిన పనులను వివరించానన్నారు. తన పరిధి దాటిన పనుల గురించి పార్టీ పెద్దలకు నివేదించానని పేర్కొన్నారు. కాగా గత ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.32 కోట్లను తాగునీటి పథకాల నిర్వహణ, మరమ్మతులకు, రూ.8 కోట్ల వరకు అభివృద్ధి పనులకు కేటాయించామన్నారు. అయితే ఆర్థిక సంఘం నిధుల్లో తాగునీటి పథకాల నిర్వహణ, మరమ్మతుల కంటే అభివృద్ధి పనులకు ఎక్కువగా కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరామని సుభద్ర వివరించారు.

# సదరం సర్టిఫికెట్ల పరిశీలనలో దళారుల దందా

... 5వ పేజీ తరువాయి

శిబిరాల్లో దళారుల ప్రమేయం పెరిగిపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల చోడవరం మండలంలోని రెండు పంచాయతీలకు నిర్వహించిన వెరిఫికేషన్ కార్యక్రమంలో దళారుల ద్వారా డాక్టర్లకు ముడుపులు ఇచ్చి కొందరు బోగస్ వైకల్యం సర్టిఫికెట్ తెచ్చుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకూ వసూలు చేస్తున్నట్టు సమాచారం.

అలాగే నిజమైన దివ్యాంగులు కూడా తమ సర్టిఫికెట్లు ఎక్కడ రద్దవుతాయోనన్న భయంతో దళారులకు ముడుపులు చెల్లించుకుంటున్నారని తెలిసింది. సదరం సర్టిఫికెట్ల పరిశీలన ప్రహసనంగా మారిందని, దీనిపై తప్పనిసరిగా విచారణ చేయాల్సిన అవసరం ఉందని స్థానిక ప్రజాప్రతినిధులు అంటున్నారు.

# ఈ శాఖ ముట్టదు.. ఆ శాఖకు పట్టదు

▸ అధ్వానంగా శంకరం రైల్వే ఫ్లైఓవర్‌పై రోడ్డు ▸ అస్తవ్యస్తంగా మారడంతో వాహనదారులకు అవస్థలు
▸ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని భాగానికి మెరుగులు ▸ రైల్వే పరిధిలోని భాగంపై ఆ అధికారుల నిర్లక్ష్యం


వంతెనపై రైల్వే పరిధిలో ఏర్పడిన గొయ్యి


వంతెన పై భాగంలో దెబ్బతింటున్న రోడ్డు

అనకాపల్లి టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి సమీపంలో ఉన్న శంకరం రైల్వే ఫ్లైఓవర్ వంతెన అధ్వానంగా మారింది. సబ్బవరం వైపు వెళ్లాలన్నా, గ్రామీణ ప్రాంత ప్రజలు కలెక్టరేట్ కార్యాలయం, జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లాలన్నా ఈ వంతెన మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. అలాగే రెండు శాఖల అధికారులు కూడా ఈ వంతెన పైనుంచే వెళ్లి వస్తుంటారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ వంతెన ప్రస్తుతం అధ్వానంగా మారింది. గతంలో జాతీయ రహదారి విభాగం అధికారులు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో భాగంగా వంతెనపై రహదారి నిర్మించారు. అయితే రైల్వే పరిధిలోని ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదు. దీంతో రైల్వే శాఖ నిర్మించిన ప్రధాన వంతెనపై భాగం గోతులమయంగా మారుతోంది. అంతేకాకుండా వంతెనకు అప్రోచ్ రోడ్డుకు మధ్య గొయ్యి మాదిరిగా ఏర్పడింది. వెంటనే దానిని సరిచేయకుంటే ముున్ముందు మరింత పెరిగి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడడంతో పాటు వంతెన ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని పలువురు ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలు వంతెనకు ఉన్న రెయిలింగ్‌లను ఢీకొనడం వలన అవి దెబ్బతిన్నాయి. అంతేకాకుండా వంతెన పొడవున రెయిలింగ్‌లపై పిచ్చి తుప్పలు పేరుకుపోయాయి. దీనికితోడు వంతెనపై ఫుట్‌పాత్ వద్ద భారీగా ఇసుక కుప్పలు దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల రోడ్డుకు సమాంతరంగా ఫుట్‌పాత్‌లు ఏర్పడి ఉండడంతో ఫుట్‌పాత్‌పై వెళ్లే వారు భయాందోళన చెందుతున్నారు. రైల్వే అధికారులు వంతెనపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## శ్రీరామ్‌నగర్ కాలనీలో చోరీ

▸ నాలుగు తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు మాయం
▸ బాధితురాలి ఫిర్యాదుతో డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు ఘటనా స్థలం పరిశీలన


చిందరవందరగా ఉన్న బీరువా.., ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

లంకెలపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసి ఉన్న ఓ ఇంట్లోకి దొంగలు చొరబడి బంగారం, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. జీవీఎంసీ 85వ వార్డు పరిధి లంకెలపాలెం శివారులో ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలివి. శ్రీరామ్‌నగర్ కాలనీలో దొంకాడ విమలకుమారి తన భర్త మరణించడంతో అద్దె ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. చిన్న కుమారుడు శివకుమార్ దుబాయ్‌లో ఉండగా, పెద్ద కుమారుడు సంతోశ్‌కుమార్ అదే కాలనీలో కూతవేటు దూరంలో కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. విమల కుమారి శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి పెద్ద కుమారుడు ఇంటికి వచ్చారు. తిరిగి ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వెళ్లి చూడగా, ప్రధాన ద్వారంతో పాటు బెడ్‌రూమ్ తలుపులు తాళాలు విరగ్గొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన నాలుగు తులాలు బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లినట్టు గుర్తించారు. వెంటనే ఆమె పరవాడ పోలీసులు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించింది. ఈ మేరకు పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డైట్‌లో రీజనల్ పోస్టల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం రీజనల్ పోస్టల్ శాఖ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. తొలుత ఈ పోటీలను డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ముఖ్య అతిథిగా ప్రారంభించారు. విశాఖపట్నం, విజయనగరం, నర్సీపట్నం, శ్రీకాకుళం, విశాఖపట్నం మెయిల్ సర్వీస్ జట్లు తలపడ్డాయి. రీజనల్ అధ్యక్షుడు వైబీ పలాసారావు, సి.శంకర్రావు, ట్రైనర్ సత్యనారాయణ, ఉపేంద్రల పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. వంద మంది పోస్టల్ శాఖ క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంప్ పోటీలు ప్రారంభం


కరాటే పోటీలను ప్రారంభిస్తున్న గండి రవికుమార్

సబ్బవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ క్రీడాకారులను అంతా ప్రోత్సహించాలని వైసీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ అన్నారు. మండలంలోని గుల్లేపల్లి అక్షర పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఫస్ట్ ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలను ముఖ్య అతిథిగా ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ యువతకు పట్టుదల, కార్యదీక్ష ఎక్కువగా ఉండడం వల్లే వారు క్రీడల్లో రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బోకం రామారావు, కరాటే శిక్షకుడు బీవీ అప్పారావు, జామి శ్రీను, సర్పంచ్ నేబర్తి శ్రీను, యడ్ల నాయుడు, సిరపురపు వాసు, ఎస్.కనకరాజు, రమణలతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్‌లు రైతులకు మరింత చేరువ కావాలి


చైర్మన్ గండి దేముడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

సబ్బవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌లు రైతులకు మరింత చేరువ కావాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. సబ్బవరం దుర్గమాంబ పీఏసీఎస్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన మాజీ ఎంపీపీ గండి దేముడు ఆదివారం బండారును స్వగ్రామం వెన్నలపాలెంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ పీవీఎస్ఎన్ రాజు, పీఏసీఎస్ సభ్యుడు పల్ల తాతారావు, టీడీపీ మండల కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, సబ్బవరం కమిటీ అధ్యక్షుడు పోతల కనకరాజు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ మార్గంలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్


రహదారిని ఆనుకొని పొదల మాటున ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

పరవాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ బీసీ కాలనీ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైపు వెళ్లే ప్రధాన మార్గంలో సీసీ రోడ్డుకు అనుకొని ఉన్న మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. కాలనీవాసులు, విద్యార్థులు, వాహనదారులు పీహెచ్‌సీ ప్రధాన రోడ్డుకు వెళ్లే వారంతా నిత్యం ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. తాగునీటి పైప్‌లైన్‌కు చెందిన ఈ మ్యాన్‌హోల్ తుప్పల చాటున ఉండడంతో పాటు మూత లేకపోవడంతో దగ్గరకు వెళ్లే వరకు కనిపించడం లేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు హడలిపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యం

▸ 'సుపరిపాలనలో తొలి అడుగు'లో టీడీపీ నేతలు


మిరియాల కాలనీలో మహిళకు కరపత్రాన్ని అందిస్తున్న పీలా గోవింద


టీడీపీ శ్రేణులతో కలిసి కలపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న గండి బాబ్జీ

అనకాపల్లి టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తున్నట్టు అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఆయన జీవీఎంసీ 83వ వార్డు పరిధిలోని మిరియాల కాలనీలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. వార్డు టీడీపీ ఇన్‌చార్జి బొద్దపు ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు పైలా గోపి, శ్రీను, కొణతాల గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పట్టణంలోని ఏఎంసీ కాలనీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పిట్ల రాజు, ఎస్.భానుచందర్, బర్నికాన శ్రీనివాసరావు, పల్లా సత్యఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

**కలపాక, రావాడ గ్రామాల్లో...**

పరవాడ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని కలపాక, రావాడ గ్రామాల్లో ఆయన టీడీపీ శ్రేణులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. అర్హులందరికీ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయకులు గండి వంశీ, నగిరెడ్డి చిన్నారావు, జనపాల రాము, చింతకాయల ముత్యాలు, కన్నూరు వెంకటరమణ, సారిపల్లి జోగినాయుడు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, పైలా రామచంద్రరావు, దాసరి వెంకటరమణ, పైలా వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి షెడ్యూల్ ప్రకారం బాబ్జీ మూలస్వయంభూవరం రానున్నట్టు ప్రకటించారు. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలంతా ఉదయం ఎనిమిది గంటల నుంచి పదకొండున్నర గంటల వరకు వేచి ఉన్నారు. బాబ్జీ రాకపోవడంతో ఫోన్ చేసి అడగ్గా, తాను రాలేనని ఆయన చెప్పడంతో అతని తీరుపై కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

## రైలు ఢీకొని రిటైర్డు లెక్చరర్ మృతి


రామారావు (ఫైల్)

అనకాపల్లి టౌన్/కొత్తూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి- కశింకోట రైల్వే మార్గంలో శనివారం సాయంత్రం జరిగిన రైలు ప్రమాదంలో స్థానిక ఏఎం ఏఎల్ కళాశాల రిటైర్డు లెక్చరర్ కె.రామారావు (68) మృతి చెందినట్టు జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపారు. ఎన్జీవోఎస్ కాలనీలో నివాసముంటున్న రామారావు పదవీ విరమణ చెందినప్పటికీ అడపాదడపా కళాశాలకు వచ్చి వెళ్తుండేవారన్నారు. ఇంట్లో కుటుంబ సభ్యులు ఊరు వెళ్లడంతో సాయంత్రం సమయంలో నడుచుకుంటూ కళాశాల వైపు వచ్చే సమయంలో కాలేజీ జంక్షన్‌కు కొంతదూరంలో విశాఖ నుంచి విజయవాడ వెళ్లే మార్గంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిద్దరూ విదేశాల్లో ఉన్నారు. ఇదిలావుంటే, ఆదివారం రాత్రి పరశురామ్‌పేటలోనిశ్మశానవాటికలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈయన మృతికి డైట్ విద్యా సంస్థల అధినేత దాడి రత్నాకర్, ఏఎంఏఎల్ కళాశాల ప్రతినిధి వాసిరెడ్డి బాలకృష్ణ తదితరులు సంతాపం తెలిపారు.

## రైలు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి

అనకాపల్లి టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు సమీపంలోని వంతెన కింద గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం సాయంత్రం రైలు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటనపై అందిన సమాచారం మేరకు జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు 5.4 అడుగుల ఎత్తు ఉంటాడని, కలర్‌ఫుల్ జీన్‌ఫ్యాంటు, కలర్‌ఫుల్ షర్టు ధరించి ఉన్నాడన్నారు. చుట్టుపక్కల పరిశీలించగా ఫాస్ట్‌ట్రాక్ సిల్వర్ కలర్ హ్యాండ్ వాచ్ లభ్యమైందన్నారు. ఇంతకు మించి ఇతర ఆధారాలు ఏవీ లభించలేదని చెప్పారు. అయితే ఇతడు ఎలా మృతి చెందాడు అన్న వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. మృతుడి వివరాల కోసం 73820 58996 నంబరులో సంప్రదించాల్సిందిగా ఆమె సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన ఆటో ముందుభాగం

కశింకోట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జాతీయ రహదారిపై ఆగి ఉన్న బొలేరో వ్యానును ఆటో ఢీకొన్న ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ఆటో ముం దుభాగం నుజ్జయ్యింది. ఇందుకు సంబంధించి ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాలివి. గాజువాక నుంచి ఎస్.రాయవరంలో జరిగిన ఓ కార్యక్రమానికి పలువురు ఆదివారం ఉదయం వెళ్లారన్నారు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం ఆటోలో వస్తుండగా, కశింకోట జాతీయ రహదారిపైకి వచ్చేసరికి ఎడమవైపు ఉన్న ఆగి ఉన్న బొలేరో వ్యాన్‌ను ఆటో ఢీకొంది. ఈఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే పెట్రోలింగ్ సిబ్బంది 108 ద్వారా ఎన్టీఆర్ ప్రభుత్వాసుత్రికి తరలించారు. ఆటోలో ఎంతమంది ఉన్నారు తదితర వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ చెప్పారు.

## ఉత్తరాంధ్రలో యాత కులస్థులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

▸ యాత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మారేష్


వేదికపై సంఘీభావం తెలుపుతున్న సంఘం ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రలో యాత కులస్థులకు కీలక రాజకీయ పదవులు ఇవ్వడం లేదని యాత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మారేష్ వాపోయారు. పట్టణంలోని నాయుళ్ల వీధిలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత కులస్థులను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంక్ రాజకీయాల వరకే వాడుకుంటున్నాయని పేర్కొన్నారు. తమ కులస్థులను నిరక్షరాస్యత, పేదరికం, నిరుద్యోగం వంటివి పట్టి పీడిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు తమకు రాజకీయ, సామాజిక రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తుర్తి అప్పారావు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో బీసీ-ఎలో ఉన్న 54 కులాల నుంచి 32 కులాలను అత్యంత వెనుకబడిన కులాలుగా గుర్తించి వారి జీవన విధానాన్ని మెరుగుపరుస్తామని జీవో నంబరు 17ను జారీ చేశారని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం యాత కులస్థులను రాజకీయాలకు దూరంగా నెట్టివేసిందని ఆరోపించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు కర్రి వెంకటరమణ, బత్తిని సత్యనారాయణ, కట్టా అప్పారావు, రాయుడు రమేష్, సంతోష్, యర్రా రాము తదితరులు పాల్గొన్నారు.

## జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో పారిశుధ్యం అధ్వానం

▸ వీధుల్లో ఎక్కడికక్కడ దర్శనమిస్తున్న చెత్తకుప్పలు
▸ రోగాల బారిన పడుతున్నామని నివాసితుల ఆవేదన


కాలనీ వీధుల్లో చెత్తకుప్పలు



పరవాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్లివానిపాలెం పంచాయతీ పరిధి జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. వీధుల్లో ఎక్కడ చూసిన చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణ పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం వల్లే ఇక్కడ ఈ పరిస్థితి నెలకొందని కాలనీవాసులు వాపోతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు చెత్తాచెదారాన్ని పలువురు కనీస బాధ్యత లేకుండా రహదారులపైనే పారబోసి వెళ్లిపోవడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. వీధికుక్కలు చెత్తను చిందరవందర చేస్తుండడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారవుతోందని చెపుతున్నారు. చెత్త వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది రాత్రివేళ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కాలువల్లో సైతం పూడిక తొలగించకపోవడంతో భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. ఈ కారణంగా రోగాలబారిన పడుతున్నామని పలువురు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి కాలనీలో పారిశుధ్యాన్ని పూర్తి స్థాయిలో మెరుగుపరచాలని అంతా కోరుతున్నారు.

## వరుణుడి కరుణ కోసం గొర్లివానిపాలెంలో కప్పల పండుగ


గొర్లివానిపాలెంలో కప్పలను ఊరేగిస్తున్న బాలురు

సబ్బవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం శివారు గొర్లివానిపాలెం గ్రామంలో ఆదివారం వరుణ దేవుడి కటాక్షం కోసం కప్పల పండుగను ఘనంగా నిర్వహించారు. యూత్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని పలువురు బాలురు కప్పల జంటను మేళతాళాలతో ఊరేగించి జోగి వసూలు చేశారు. మహిళలు, యువతులు కప్పల జంటకు జలాభిషేకం చేశారు. గ్రామంలో వసూలు చేసిన చందాతో సూది కొండపై కొలువై ఉన్న వరుణ దేవుడికి నైవేద్యం పెట్టి మిగిలిన నైవేద్యాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ కప్పల పండుగను దశాబ్దాల కాలంగా పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు గండి దేముడు, గొర్లి కృష్ణ, రామకృష్ణ, గొంప వినోద్, అప్పలనాయుడు, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల కళాశాలలో ఎంఈసీ గ్రూపు పునః ప్రారంభం

కొయ్యూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కాకరపాడు గురుకుల కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఎంఈసీ గ్రూపును పునఃప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ లక్ష్మణ్ తెలిపారు. గతంలో కళాశాలలో ఈ గ్రూపు ఉండేది. గత మూడేళ్లుగా ఈ గ్రూపు లో అడ్మిషన్లు నిలిపివేసినట్టు చెప్పారు. తిరిగి 2025-26 నుంచి ఎంఈసీ గ్రూపును పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. 35 సీట్లు కేటాయించారని ఇందులో ఎస్సీ, బీసీ, స్పోర్ట్స్ కోటాతో పాటు ఏబిక్యులకు ఒక్కో సీటు మినహా మిగిలినవి ఎస్టీ విద్యార్థులతో భర్తీ చేయనున్నట్టుగా ప్రిన్సిపాల్ వివరించారు. 10వ తరగతి పూర్తయిన విద్యార్థులు ఈ అవ కాశాన్నిసద్వినియోగపర్చుకోవాలని లక్ష్మణ్ సూచించారు.

## ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

జి.మాడుగుల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఇవానిస్ దినం పురస్కరించుకొని ఈ నెల 15వరకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఫాదర్ స్టీఫెన్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక గాంధీనగర్ కాలనీలో మలయంగర్ క్యాథలిక్ చర్చి, పాడేరు సెయింటెన్స్ పాఠశాలల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన సుమారుగా 120 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మోబిన్, సిస్టర్స్ జూడిట్ జూలియన్ పాల్గొన్నారు.

## మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



హుకుంపేటలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

హుకుంపేట జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మోదకొండమ్మ ఆలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. అమ్మవారిని శాకంబరిగా కూరగాయలు, పండ్లు, పూలతో అలంకరించారు. గిరిజనులు సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

## పూసలపాలెం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ లక్ష్మయ్య

చింతపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మంగుల పంచాయతీ పూసలపాలెం నుంచి కేఎస్ దుర్గం వరకు రూ.2.64కోట్ల పీఎం జన్మన్ నిధులతో తారు రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు స్థానిక సర్పంచ్ సలిమితి లక్ష్మయ్య అన్నారు. ఆదివారం ఈ నిర్మాణానికి అయన భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శివారు గిరిజన గ్రామాలకు తారు రోడ్డు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. ప్రస్తుత రహదారి నిర్మాణ జరిగితే సుమారు 12 గ్రామాల గిరిజనులు ఎదుర్కొంటున్న రవాణా కష్టాలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవ రాము, పేసా కమిటీ ఉపాధ్యక్షుడు, కార్యదర్శి బొంజు బాబు, చెల్లయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## ఉమానీలకంఠేశ్వరస్వామికి వెండి నామాలు బహూకరణ



గిరికైలాస క్షేత్రానికి వెండి నామాలు, తాడు అందిస్తున్న విశాఖకు చెందిన భక్తులు

పాడేరురూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పాడేరులో ప్రసిద్ధ ఉమానీలకంఠేశ్వరస్వామి వారి సమేత రాజ రాజేశ్వరి అమ్మవారి ఆలయానికి విశాఖపట్నంకు చెందిన బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్‌వీవీ కుమార్, స్వాతి దంపతులు ఆదివారం వెండి నామాలు, తాడును బహూకరించారని ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు తెలిపారు. ముందుగా ఈ దంపతులకు ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీరామం పంతులు ఆలయంలో స్వామి వారి ప్రత్యేక దర్శనం చేయించి ఆశీర్వచనం అందించారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు. వారిని సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుల్లి రమేశ్‌నాయుడు, కొట్టగుల్లి రామారావు, సిద్ధినాతి కొండలరావు, శివరాత్రి శ్రీనివాస్ కుమార్, కారం దేముడు, కఠారి శ్రీనివాస్, బాబూరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

## పర్యాటకులకు కెమెరా అప్పగింత

జి.మాడుగుల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లి జలపాతం సందర్శనకు వచ్చిన పర్యాటకులు కెమెరాను మరిచి వెళ్లిపోయారు. తిరిగి ఆ కెమెరాను ఏకో టూరిజం సభ్యులు అప్పగించి నిజాయితీని చాటుకున్నారు. ఆదివారం తెలంగాణలోని భద్రాది కొత్తగూడెం ప్రాంతానికి చెందిన యువకుల బృందం ఈ ప్రాంత సందర్శనకు వచ్చారు. వీరు కెమెరాను పొరపాటున మరిచి వెళ్లి పోయారు. అయితే, పాడేరు వరకు వెళ్లి మళ్లీ తిరిగి వచ్చారు. రూ. లక్ష ఖరీదు చేసే కెమెరాను భద్రంగా ఉంచి సదరు యువకులకు అప్పజెప్పడంతో వారు కృతజ్ఞతలు చెప్పారు.

# 'నయాపైసా' ఖర్చులేకుండా పోషకాలు

- ఏజెన్సీలో విరివిగా లభిస్తున్న నయాపైసా మొక్క
- ఆకులు, రెమ్మల్లో సూక్ష్మ పోషకాలు..
- పచ్చిరొట్ట ఎరువుగా సద్వినియోగం

చింతపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి):గిరిజన ప్రాంతంలో విరివిగా లభించే నయాపైసా మొక్క.. పచ్చిరొట్ట తరహాలో పంటలకు ఎన్నో పోషకాలు అందిస్తుందని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు అధ్యయనంలో రుజువైంది. ఈ మొక్క ఆకులను భూమిలో కలియదున్నుకుంటే పంటలకు అవసరమైన సారవంతమైన పోషకాలు అందుతాయని చెబుతున్నారు. ఖర్చులేకుండా ఈ ఆకులతో రైతులు నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు. స్థానిక మండల వ్యవసాయ అధికారి బి. శ్రీనివాసరావు తాజాగా ఈ మొక్కలతో చేకూరే ప్రయోజనాలపై జిల్లా కలెక్టర్‌కి నివేదిక ఇచ్చారు. గిరిజన ప్రాంత అడవులు, గ్రామాల్లో నయాపైసా మొక్కలు అధికంగా కనిపిస్తుంటాయి. ఈ మొక్కను సాధారణంగా రైతులు కంచె కోసం, పశుగ్రాసంగా వినియోగిస్తున్నారు. అయితే ఈ మొక్క ఆకులను పచ్చిరొట్ట స్థానం లో వినియోగించడం ఎంతో మంచిది. ఖరీఫ్ సాగుకి ముందు రైతులు పచ్చిరొట్ట జనుము, పిల్లిపెసర, జీలుగ రకాల విత్తనాలను పంట పొలాల్లో నాటుకుని నాట్లకు ముందుగా భూమిలో కలియదున్నుకుంటున్నారు. దీని వల్ల పంటలకు అవసరమైన సూక్ష్మపోషకాలు అందుతాయి. అయితే, గిరిజన ప్రాంతంలో సహజసిద్ధంగా లభించే నయాపైసా మొక్కల నుంచి ఆకులతో కూడిన రెమ్మలను సేకరించి పొలాల్లో ఆఖరి దుక్కిలో కలియదున్నడం వల్ల పచ్చిరొట్ట అందించే పోషకాలు పంటలకు అందుతాయని ఏవో చెబుతున్నారు.

### బహుళ ప్రయోజనకారి

నయాపైసను గ్లైరిసిడియా అని పిలుస్తారు. ఫాబేసి కుటుంబంతోపాటూ లెగ్యూమ్ జాతికి చెందిన ఈ మొక్కలు మధ్యస్థంగా పెరుగుతాయి. సుమారు 33 నుంచి 38 అడుగుల ఎత్తువరకు ఎదుగుతాయి. ఈ మొక్కల్లోని అన్ని భాగాలు బహుళ ప్రయోజనాలు అందిస్తాయి. పంటలకు కంచెగా, వంట చెరకుగా, పశువులకు మంచి పోషకాలు అందించే పశుగ్రాసంగా, పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడుతుంది. నయాపైస మొక్కలు ప్రధానంగా వాతావరణంలో లభించే నత్రజనిని



నయాపైసా ఆకులు



గిరిజనులు కంచెగా మొక్క

భూమిలో స్థిరీకరించి భూ సారాన్ని పెంచుతుంది. మన దేశంతోపాటూ పలు దేశాల్లో వీటిని ప్రత్యేకంగా సాగు చేస్తున్నారు. కొందరు రైతులు అంతర పంటగా వేస్తున్నారు. ఈ నయాపైసా ఆకులు, రెమ్మలు పొలం ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నుకోవడంవల్ల ఎరువుగా మారి ద్వారా 4శాతం నత్రజని భూమికి అం దుతుంది.

### పచ్చి ఆకులను కలియదున్నాలి



ఎకరాకు ఒకటి నుంచి రెండు టన్నుల వరకు పచ్చి ఆకులను కలియదున్నుకోవాలి. ఈ మొక్కల విత్తనాలు, బెరడు ఎలుకలు నివారణకు ఉపయోగపడతాయి. వర్షాధారంగా పండించే పంటలకు మంచి ఉపయోగపడుతుంది. ఈ మొక్కలను పొలాల గట్లు వద్ద పెంపకం వల్ల పర్యావరణానికి హాని కలిగించని ఎరువు లభిస్తుంది.

-మండల వ్యవసాయ అధికారి బి. శ్రీనివాసరావు , చింతపల్లి

# అగ్రికల్చర్ పాలిటెక్నిక్ పునరుద్ధరణకు దశలవారీగా ఆందోళన

- గిరి జనజాగృతి సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముర్ల వెంకట రమణ

చింతపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణకు దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని గిరి జనజాగృతి సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముర్ల వెంకట రమణ తెలిపారు. ఆదివారం స్థానిక గిరిజన భవన్‌లో నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ చింతపల్లి ప్రాంతం కొంతకాలంగా నిర్లక్ష్యానికి గురవుతోందన్నారు. నియోజక వర్గం పాడేరులో విలీనం చేయడంతో ప్రాధాన్యత తగ్గిందన్నారు. చింతపల్లికి మంజూరైన సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాల, గిరిజన విశ్వవిద్యాలయం, 133కేవీ విద్యుత్ ఉప కేంద్రం దూరమయ్యాయన్నారు. చింతపల్లి వ్యవసాయ విద్యకు అనుకూలమైన ప్రాంతమన్నారు. సుదూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సైతం చింతపల్లిలో విద్యాభ్యాసానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈనేపథ్యంలో పాలిటెక్నిక్ కళాశాలను పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం నుంచి వారం రోజులపాటు ఉమ్మడి విశాఖ ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, వ్యవసాయశాఖ మంత్రి, కమిషన్‌కి వినతి పత్రాలు అందజేశామన్నారు. స్థానిక ప్రజలతో కలిసి ఉమ్మడి విశాఖలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్రంలోనే ఏకైన ఆర్గానిక్ పాలిటెక్నిక్ కళాశాలను ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని, ఈ కార్యక్రమంలో జీకేవీధి, చింతపల్లి ఎంపీపీలు బోయిన కుమారి, కోరాబు అనుషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీసెల్ చైర్మన్ రీమల నవభరత్, సీపీఎం నాయకుడు సాగిన చిరంజీవి, జనసేన నాయకులు బుజ్జిబాబు, వీరవెంకట్, సుర్ల వీరేంద్ర, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, సీనియర్ నేత పెదిరెడ్ల బేతాళుడు, వైసీపీ నాయకులు జల్లి సుధాకర్, మోరి రవి, బీజేపీ నాయకుడు దుక్కెరి ప్రభాకరరావు, గిరిజన సంఘ నాయకుడు లోచలి రామకృష్ణ, వెంకట రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిరి జనజాగృతి సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముర్ల వెంకట రమణ

### ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

చింతపల్లి: స్థానిక ఆర్గానిక్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఎత్తివేస్తున్నట్టు ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత కోరారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్లపాటు విద్యార్థులకు వ్యవసాయ విద్యను అందించిన కళాశాలను ఆకస్మికంగా మూసివేయడం బాధాకరమన్నారు. ఈ కళాశాలలో ఉత్తరాంధ్రతోపాటూ రాయలసీమ విద్యార్థులు సైతం వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యను అభ్యసించారన్నారు. మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. ఈస్థితిలో కళాశాలను యథావిధిగా కొనసాగించాలని, లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

## టీడీపీ గ్రామ కమిటీ ఎన్నిక వాయిదా



అరకు ఎన్నికల్లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

డుంబ్రిగుడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీ అరకు గ్రామ కమిటీ ఎన్నిక వాయిదా పడింది. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ ఎన్నికకు స్థానిక నాయకులు, కార్యకర్తల మధ్య పోటీ నెలకొంది. దీంతో అధ్యక్షులు ఈ ఎన్నిక వాయిదా వేశారు. సొవ్వ పంచాయతీలో సంస్థాగత గ్రామ ఎన్నిక ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా కిల్లో బాబూరావు అధ్యక్షుడిగా, కార్యదర్శిగా మల్లన్న, పది మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, మాజీ సర్పంచ్ వెంకటరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## నేడు అమ్మవార్లకు శాకంబరి అలంకరణ

పాడేరురూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గిరికైలాస క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన స్థానిక ఉమానీలకంఠేశ్వస్వామి వారి సమేత రాజరాజేశ్వరి ఆలయంలో ఉన్న దేవతామూర్తులను శాకంబరీ దేవిలుగా సోమవారం భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్టు ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆధ్యాత్మిక సేవా బృందం, భక్తి బృంద సభ్యులు కూరగాయలు సేకరిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించే పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొవాలని కోరారు.

## ఆరుబయట వంటలతో అవస్థలు



సీలేరు ఎంపీపీ పాఠశాలలో ఆరుబయట వంట చేస్తున్న నిర్వాహకులు

సీలేరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు ఎంపీపీ పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు షెడ్డు లేకపోవడంతో ఆరు బయట వంటను చేయాల్సి వస్తోంది. ఈ పాఠశాలలో ఒకటి నుంచి 5 వ తరగతి వరకు 80 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. వీరికి రోజూ మధ్యాహ్న భోజనాలు సమకూర్చడానికి నిర్వాహకులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. షెడ్డు లేకపోవడంతో వర్షం పడినా, ఎండైనా ఆవరణలోని ఆరుబయటే వంటలు చేయాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 15 రోజులుగా వర్షాలు కురుస్తుండంతో ఆవరణంతా బురదమయంగా మారిందని తెలిపారు. ఈ స్థితిలోనే వంటలు చేయాల్సి రావడంతో తీవ్ర ఇబ్బంది ఎ దుర్కొంటున్నట్టు తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో నాడు- నేడు పథకంలో అన్ని వసతులు కల్పిస్తామని నిధులు దుర్వినియోగం చేశారే తప్పా పాఠశాల అభివృద్ధి చేపట్టిన దాఖలాలేవు. కనీసం వంట షెడ్డు సమకూరలేదనిచెబుతున్నారు. కూటమి ప్ర భుత్వంలో అధికారులు స్పందించి వంట షెడ్డు నిర్మాణానికి చొరవ చూపాలని వర్కర్లు, విద్యార్థులతల్లిదండ్రులు కోరుతున్నారు.

## జోరుగా వరినాట్లు

హుకుంపేట జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ముమ్మరంగా ఖరీఫ్ పనులు సాగుతున్నాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డలు, ఊటలు పొంగి ప్రవహిస్తున్నాయి. పొలాలకు నీరు వస్తోంది. దీంతో పొలాల్లో ద మ్ము పనులు చేపడుతున్నారు. కుటుంబాలతో సహా పొలాల్లో ఉంటున్నారు. దీంతో గ్రామాల్లో వృద్ధులు మినహా మరెవరూ కానరావడంలేదు.



హుకుంపేటలో వరి నారు మడులు



జి. మాడుగుల మండలం వి.కోడాపల్లిలో నాట్లు వేస్తున్న రైతులు

ఈ ఏడాది వర్షాలు అనుకూలించడంతో రైతులుఆనందం వ్యక్తంచేస్తున్నారు.

**జి.మాడుగుల:** మండలంలో పలు గ్రామాల్లో గిరిజనులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. వరి నాట్లకు మడులు సిద్ధం చేశారు. కొన్ని గ్రామాల్లో ఉబాలు జోరుగా సాగుతున్నాయి.

## ఆటో బోల్తా- నలుగురికి తీవ్రగాయాలు

కొయ్యూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని డౌనూరు పంచాయతీ రొబ్బసింగి ఘాట్‌లో ఆదివారం సాయంత్రం ఆటో బోల్తా కొట్టిన ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులకు తొలుత డౌనూరు పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మండలంలో చిట్టింపాడు పంచాయతీ గోపవరంలో ఒక వ్యక్తి మృతి చెందడంతో చింతపల్లి మండలం బలపం కోరుకొండకు చెందిన ఆరుగురు బంధువులు ఆటో వెళ్లారు. మృతి చెందిన వ్యక్తి అంత్యక్రియల్లో పాల్గొని తిరుగు ప్రయాణంలో రొబ్బసింగి ఘాట్‌రోడ్డు దిగుతున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కోరుకొండకు చెందిన జనుమూరి పుష్పలరావు(48), పూజారి లక్ష్మి (40), తలే ఆనందరావు(28), వి. జాహ్నవిలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వస్తున్న తోటలూరుకు చెందిన కాకురు చంద్రరావు, తదితరులు ప్రమాదాన్ని గుర్తించి. క్షతగాత్రులను ద్విచక్ర వాహనాలపై సమీప డౌనూరు పీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందించారు. అనంతరం క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.



అదుపు తప్పి బోల్తా పడిన ఆటో







సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

## కూటమి ప్రభుత్వంలోనే గిరిజనాభివృద్ధి

- ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర



గుమ్మకోటలో కరపత్రాలందిస్తున్న దొన్నుదొర, పరిశీలకులు శివకృష్ణరాజు, తదితరులు

అనంతగిరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజన గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు . మండలంలోని భీసుపురం, కొత్తూరు, గుమ్మకోట గ్రామాల్లో ఆదివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొన్నుదొర ఏడాదిగా అమలు చేసిన పథకాలు, అభివృ పనులపై గ్రామాల్లో గిరిజనులకు అవగాహన కల్పించారు. పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అలాగే గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ, తదితర సమస్యలను పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలోని అరకు నియోజకవర్గ పరిశీలకులు కరణం శివరామకృష్ణరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు సోవేరి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మజ్జి భీమరాజు, కొత్తూరు, భీంపోల్ సర్పంచ్‌లు సీతయ్య, భీమ్మలమ్మ, ఈశ్వరరావు, పాంగి బాబీ, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

## బడి లేకుండా పిల్లల చదువులు ఎలా?

- పిట్టలపాడులో తల్లిదండ్రుల ఆందోళన
- ఎన్ఆర్ఎస్‌టీసీ సెంటరైనా ఏర్పాటు చేయాలని అభ్యర్థన



పిట్టలపాడులో బడి ఈడు పిల్లలతో తల్లిదండ్రులు, పెద్దలు

కొయ్యూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో బూదరాళ్ళ పంచాయతీ పిట్టలపాడు గ్రామంలో బడిఈడు పిల్లల భవిష్యత్తు కాపాడేందుకు కనీసం నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌టీసీ)నైనా నెలకొల్పాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. గ్రామంలో 70 కుటుంబాలు నివసిస్తున్నాయి. సుమారు 40 మంది బడి ఈడు పిల్లలుఉన్నారు. వీరిలో పది మంది విద్యార్థులు సుమారు రెండు కిలో మీటర్లు దూరంలోని గరిమండ పాఠశాలకు వెళ్లి చదువుతున్నారు. మిగిలిన వారంతా ఆకతాయిలుగా గ్రామంలో తిరుగుతున్నారు. గత తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో ఈ గ్రామంలో ఎన్ఆర్ఎస్‌టీసీ సెంటర్‌ను నెలకొల్పి వలంటీర్ ద్వారా పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే వారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ సెంటర్‌ను ఎత్తివేయడంతో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. ఈ విషయంపై గత ఏడాది పాడేరులో నిర్వహించే స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందించారు. అప్పట్లో కలెక్టరు, డీఈవో ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ, తర్వాత చర్యలు చేపట్టలేదని తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా కలెక్టరు, విద్యాశాఖాధికారులు దృష్టి సారించి గ్రామంలోని పిల్లలకు విద్య కోసం పాఠశాలనైనా నెలకొల్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## నేడు ఐటీడీఏ ఎదుట ఆందోళన

హుకుంపేట జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆదివాసులకు ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని కోరుతూ, ఈ నెల 14న పాడేరు ఐటీడీఏ వద్ద చేపట్టనున్న ఆందోళనను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు టి. కృష్ణారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెలా 14న పాడేరు ఐటీడీఏ వద్దకు ఉదయం 10గంటలకు చదువుకున్న యువకులు, మేధావులు, ప్రజా సంఘాల నేతలు రావాలన్నారు. గతంలో ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టులు మెగా డీఎస్సీ నుంచి మినహాయించి స్థానికులకే కేటాయించా జీవో ఇవ్వాలన్నారు. ఈ నేపథ్యంలో చేపట్టనున్న ఆందోళనను విజయవంతం చేయాలని కోరారు.

## నిధుల సమాచారం ఇవ్వకపోవడం తప్పే..

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. అదేవిధంగా టూర్ నిర్వహించాలని జడ్పీటీసీ సభ్యులు కోరుతున్నా పాలకవర్గం ఏర్పాటు నుంచే ప్రభుత్వం అనుమతి ఇవ్వడం లేదని ఆమె వెల్లడించారు. సభ్యుల్లో నెలకొన్న సందేహాలు, అసంతృప్తి నేపథ్యంలో రెండురోజుల క్రితం తమ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల సమక్షంలో జడ్పీటీసీ సభ్యులతో సమావేశం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించామని, చైర్‌పర్సన్‌గా తన పరిధిలో చేసిన పనులను వివరించానన్నారు. తన పరిధి దాటిన పనుల గురించి పార్టీ పెద్దలకు నివేదించానని పేర్కొన్నారు. కాగా గత ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.32 కోట్లను తాగునీటి పథకాల నిర్వహణ, మరమ్మతులకు, రూ.8 కోట్ల వరకు అభివృద్ధి పనులకు కేటాయించామన్నారు. అయితే ఆర్థిక సంఘం నిధుల్లో తాగునీటి పథకాల నిర్వహణ, మరమ్మతుల కంటే అభివృద్ధి పనులకు ఎక్కువగా కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరామని సుభద్ర వివరించారు.

## సదరం సర్టిఫికెట్ల పరిశీలనలో దళారుల దందా

... 5వ పేజీ తరువాయి

శిబిరాల్లో దళారుల ప్రమేయం పెరిగిపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల చోడవరం మండలంలోని రెండు పంచాయతీలకు నిర్వహించిన వెరిఫికేషన్ కార్యక్రమంలో దళారుల ద్వారా డాక్టర్లకు ముడుపులు ఇచ్చి కొందరు బోగస్ వైకల్యం సర్టిఫికెట్ తెచ్చుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకూ వసూలు చేస్తున్నట్టు సమాచారం. నిజమైన దివ్యాంగులు కూడా తమ సర్టిఫికెట్లు ఎక్కడ రద్దవుతాయోనన్న భయంతో దళారులకు ముడుపులు చెల్లించుకుంటున్నారని తెలిసింది. సదరం సర్టిఫికెట్ల పరిశీలన ప్రహసనం గా మారిందని, దీనిపై విచారణ జరపాల్సిన అవసరం ఉందని స్థానిక ప్రజాప్రతినిధులు అంటున్నారు.

## గర్భిణికి తప్పని డోలీ మోత

... 5వ పేజీ తరువాయి

ఆదివారం ఉదయం నొప్పులు రావడంతో భర్త సుందరరావు కుటుంబ సభ్యుల సహాయంతో నాలుగు కిలోమీటర్లు డోలీ కట్టించుకుని వైబీపట్నం వరకు తీసుకువచ్చారు. అంబులెన్సు ఆలస్యంగా రావడంతో అక్కడే పాంగి సాయికి మర్రి చెట్టు వద్ద ప్రసవం అయ్యి పాపకు జన్మనిచ్చింది. అనంతరం అంబులెన్సు రావడంతో అక్కడి నుంచి బుచ్చెంపేట పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందిస్తున్నారు. దీంతో తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు.

### మధ్యలో నిలిచిన రహదారి నిర్మాణం

డోలీ మోతలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వైబీపట్నం నుంచి లోసింగి వయా పెదగరువు గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్ నాలుగు నెలల క్రితం పనులు ప్రారంభించారు. అయితే ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదంటూ కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేశారు. అప్పటి వరకు చేసిన పనుల్లో ఇటీవల కురిసిన వర్షాలకు సైడ్ కాలువలు కొట్టుకుపోయాయి. రోడ్డు కూడా అక్కడక్కడ కొట్టుకుపోయింది. దీంతో వాహనాలు వెళ్లే అవకాశం లేకుండాపోయింది. రోగులు, గర్భిణులు అత్యవసరమైతే డోలీలో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే రోడ్డు పనులను పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## కుమ్మేసిన వాన

... 5వ పేజీ తరువాయి

వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సీతమ్మధారలోని కేఆర్ఎం కాలనీలో మోకాలు లోతులో నీరు ప్రవహించింది. నీటి ప్రవాహ ధాటికి రోడ్లపై పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు కొట్టుకు పోయాయి. ఇవి వర్షంలో కొట్టుకుపోతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. సీతమ్మధారలో 34 మి.మీ., ధారపాలెంలో 24 మి.మీ. వర్షపాతం నమోదైంది.



మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్న... (ఇన్‌సెట్‌లో) కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

## మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

నర్సీపట్నం అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గో హాస్పటల్, అమెరికా వైద్య బృందం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఈ శిబిరంలో రోగులకు వైద్య నిపుణులు ఆరోగ్య పరీక్షలు చసి, అవసరమైన మందులను అందజేశారు. బీపీ, షుగర్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ వెరికోస్ వెయిన్స్ వ్యాధిపై అవగాహన లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పించడానికి అమెరికా నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు ఈ ప్రాంతానికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అవగాహనతోనే కొన్ని రోగాలు దూరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, కౌన్సిలర్లు పద్మావతి, రాజేశ్, గో హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ సువర్ణ, వైద్యులు సంపత్, శ్రీతేజ, చంద్రశేఖర్, మధులిక, ఆశ్రిత, శంకర్ ఫౌండేషన్ వైద్య బృందం పాల్గొన్నారు.

## తామరబ్బలో 536 మందికి వైద్య సేవలు



శిబిరంలో గిరిజనులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

దేవరాపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరబ్బ గిరిజన పంచాయతీలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 536 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు చేశారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారి సౌజన్యంతో సత్య సాయి సేవా సమితి, సంస్థలు నిర్వహించిన వైద్య శిబిరానికి సాధారణ వ్యాధులు, గైనిక్, ఈఎన్‌టీ, ఆప్తాలమిజీ, డెంటల్, ఆర్థోపెడిక్ తదితర రోగాలకు వైద్యులు పరీక్షలు చేశారు. అలాగే అవసరమైన మందులను రోగులకు ఉచితంగా పంపిణీ చేశారు. మారుమూల గిరిజనులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. సత్యసాయి జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, సభ్యులు రమేషగుప్తా, కృష్ణమూర్తిరాజు, రాజశేఖర్, కామరాజు, కె.రాంబాబు, రవిశంకర్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1977-78, 1978-80 బ్యాచ్‌లకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలుసుకున్నారు. దాదాపు 45 ఏళ్ల తరువాత కలసుకున్న వారి ఆనందానికి అవధుల్లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. అనంరం గురువులు నరసింహమూర్తిశాస్త్రి, రమణారావులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

## జన్నవరంలో యువకుల ఆదర్శం

**అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.1.21 లక్షల సాయం**



బాబూరావు కుటుంబానికి రూ.1.21 లక్షల చెక్కు అందిస్తున్న యువకులు

చోడవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నవరం గ్రామానికి చెందిన యువకులు ఓ పేద వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సహకారం అందించారు. గ్రామానికి చెందిన షైలవరపు బాబూరావు ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. పేద కుటుంబానికి చెందిన బాబూరావుకు సహకారం అందించేందుకు గ్రామానికి చెందిన యువకులు, ఉద్యోగులు ముందుకు వచ్చారు. అందరూ కలిసి లక్షా 21 వేల రూపాయలు సమీకరించారు. ఈ మొత్తాన్ని ఆదివారం బాబూరావు కుటుంబ సభ్యులకు అందించి ఆదర్శంగా నిలిచారు. దీంతో జన్నవరం యువకుల సహకారాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు.

## ఘనంగా మోదకొండమ్మ ఘటాల పండుగ



ఘాట్ రోడ్డు జంక్షన్‌లో ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మాడుగుల రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘాట్ రోడ్డు జంక్షన్ మోదకొండమ్మ పాదాల ఆలయం వద్ద ఆదివారం వర్తకసంఘం, ఆటో యూనియన్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో 108 ఘటాలతో పండుగ నిర్వహించారు. స్థానిక భక్తులంతా కలిసి అమ్మవారికి సమర్పించేందుకు 108 ఘటాలు సిద్ధం చేసి, వాటిని నెత్తిన పెట్టుకుని జంక్షన్‌లో ఊరేగించారు. జంక్షన్‌లోని అమ్మవారి పాదాల వద్ద మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజారామ్, సంఘం సభ్యులు పుట్టా బలరాం, కోట్ని సత్తిబాబు, శ్రీను, కొండలరావు, వెంకటరావు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## బైక్‌పైకి దూసుకుపోయిన వ్యాన్

బుచ్చెయ్యపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది హైస్కూల్ వద్ద బొలెరో వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న బైక్‌పైకి దూసుకుపోయింది దీంతో బైక్‌పై కూర్చొన్న సిహెచ్.లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు, సెలవు రోజు మధ్యాహ్న సమయం కావడంతో జన సంచారం లేదని, దీంతో పెను ప్రమాదం తప్పిందని వారు ఊపిరి తీసుకున్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి
- ఎం.కోటపాడులో 'సుపరిపాలనలో తొలి అడుగు'

మాడుగుల రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని ఎం.కోటపాడు గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే బండారు ఇంటింటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకెళుతోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్లిష్టతరంగా ఉన్నప్పటికీ ప్రజల అభ్యున్నతి, సంక్షేమమే అజెండాగా పాలన సాగుతోందన్నారు. అధికారులతో సమన్వయంగా పనిచేస్తూ సమస్యలు పరిష్కరించడంలో ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అద్దిపల్లి జగ్గారావు, దేముడు, పుప్పాల రమేశ్, మజ్జి లక్ష్మీరావు, శ్రీను, పిల్లా నాయుడు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎం.కోటపాడులో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు, నాయకులు

# లోపూడిలో దాహం కేకలు

**వారం రోజులుగా పనిచేయని మోటారు**
**గుక్కెడు నీటికి ప్రజల అపసోపాలు**
**చేతులెత్తేసిన అధికారులు, పాలకులు**



చుక్క నీరు ఇవ్వని తాగునీటి ట్యాంకు



వారం రోజులుగా పనిచేయని మోటారు

బుచ్చెయ్యపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోపూడి గ్రామంలో వారం రోజులుగా దాహం కేకలు వినిపిస్తున్నాయి. గుక్కెడు నీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. మెటార్ పనిచేయకపోవడంతో నీటి పథకం మూలకు చేరిపోయింది. ఈ సమస్య తెలిసినప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమీ చేయలేక చేతులెత్తేయడం విశేషం.

అలాగే అద్దె భవనంలో నడుస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు కూడా చెట్ల కింద విధులు నిర్వహిస్తుండడం విచారకరం. సచివాలయానికి అద్దె అద్దె చెల్లించకపోవడంతో యజమాని తాళం వేసేశారు. ఇటీవల సచివాలయం కరెంట్ బిల్లు కూడా చెల్లించకపోవడంతో విద్యుత్ సిబ్బంది కరెంట్ కనెక్షన్ తొలగించారు. ఫలితంగా మెటారు పనిచేయక తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో గ్రామ ప్రజలు బిందెడు నీటి కోసం బండెడు కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా, నిధులు లేవని సమాధానం ఇచ్చారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు వేడుకుంటున్నారు.

# స్వచ్ఛ సమాజానికి సహకరించాలి

- చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన సమాజ స్థాపనలో సేవా సంస్థల సహకారం ఎంతో అవసరమని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సేవలను ప్రశంసించారు. అలాగే క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సమాజానికి క్లబ్ ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. కాగా, క్లబ్ 2025-26 సంవత్సరానికి అధ్యక్షుడిగా పసుమర్తి సాంబమూర్తి, కార్యదర్శిగా బద్రిమహంతి ఫల్గుణ్, కోశాధికారిగా పి.గంగాధర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా నేతలు అధికారి గోపాలరావు, సీఐ పి.అప్పలరాజు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు పి.సుధీర్, ఇందిర, ఉప్పల వెంకటరాజు మాట్లాడారు. క్లబ్ కార్యవర్గ సభ్యులుగా ఉగ్గిన నాగబాబు, కాండ్రేగుల డేవిడ్, పూసర్ల శంకుతలరావు, గనిరెడ్డి, వేపాడ సత్యనారాయణ, పసుమర్తి శ్రీనివాస్, దీపక్, హరిబాబు, మల్లిక్, సిరిసోళ్ల ఆదిగణపతినాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ కార్యక్రమాల ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

# ఉత్తరాంధ్రలో యాత కులస్థులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

- యాత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మారేష్

అనకాపల్లి టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రలో యాత కులస్థులకు కీలక రాజకీయ పదవులు ఇవ్వడం లేదని యాత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మారేష్ వాపోయారు. పట్టణంలోని నాయుళ్ల వీధిలో ఆదివారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత కులస్థులను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంక్ రాజకీయాల వరకే వాడుకుంటున్నాయని పేర్కొన్నారు. తమ కులస్థులను నిరక్షరాస్యత, పేదరికం, నిరుద్యోగం వంటివి పట్టి పీడిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు తమకు రాజకీయ, సామాజిక రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తుర్తి అప్పారావు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో బీసీ-ఎలో ఉన్న 54 కులాల నుంచి 32 కులాలను అత్యంత వెనుకబడిన కులాలుగా గుర్తించి వారి జీవన విధానాన్ని మెరుగుపరుస్తామని జీవో నంబరు 17ను జారీ చేశారని గుర్తు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం యాత కులస్థులను రాజకీయాలకు దూరంగా నెట్టివేసిందని ఆరోపించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు కర్రి వెంకటరమణ, బత్తిని సత్యనారాయణ, కట్టా అప్పారావు, రాయుడు రమేష్, సంతోష్, యర్రా రాము తదితరులు పాల్గొన్నారు.



వేదికపై సంఘీభావం తెలుపుతున్న సంఘం ప్రతినిధులు

## శ్రీరామ్‌నగర్ కాలనీలో చోరీ

- నాలుగు తులాల బంగారు, 20 తులాల వెండి మాయం
- బాధితురాలి ఫిర్యాదుతో డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు ఘటనా స్థలం పరిశీలన



చిందరవందరగా ఉన్న బీరువా

లంకెలపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఓ ఇంట్లోకి దొంగలు చొరబడి బంగారం, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. జీవీఎంసీ 85వ వార్డు పరిధి లంకెలపాలెం శివారులో ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలివి. శ్రీరామ్‌నగర్ కాలనీలో డొంకాడ విమల కుమారి తన భర్త మరణించడంతో అద్దె ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. చిన్న కుమారుడు శివకుమార్ దుబాయ్‌లో ఉండగా, పెద్ద కుమారుడు సంతోశ్ కుమార్ అదే కాలనీలో కూతవేటు దూరంలో కుటుంబ సభ్యులతో నివాసముంటున్నాడు. విమల కుమారి శనివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి పెద్ద కుమారుడు ఇంటికి వచ్చారు. తిరిగి ఆదివారం మధ్యాహ్నం ఇంటికి వెళ్లి చూడగా, ప్రధాన ద్వారంతో పాటు బెడ్‌రూమ్ తలుపులు తాళాలు విరగ్గొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన నాలుగు తులాలు బంగారు, 20 తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లినట్టు గుర్తించారు. వెంటనే ఆమె పరవాడ పోలీసులు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం వేలి ముద్రలను సేకరించింది. ఈ మేరకు పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మూడు ట్రాకర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

కోటవురట్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టివాడ గ్రామంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న మూడు ట్రాకర్లు, ఎక్స్‌కవేటర్‌ను ఆదివారం సీజ్ చేసినట్టు ఎస్ఐ రమేశ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. ఒక భూమిలో మట్టిని అనుమతులు లేకుండా తవ్వి తరలిస్తున్న ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను పట్టుకొని పోలీసు స్టేషన్ తరలించామన్నారు. వాటిని తహసీల్దార్‌కు అప్పగిస్తామని చెప్పారు. అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్, ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా చేసిన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు

## ఎండుతున్న వరినారు మడులు

- ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసుకుని తడుపుతున్న రైతులు



రోలుగుంటలో మోటార్లను ఏర్పాటు చేసి నారుమడులను తడుపుతున్న రైతులు

రోలుగుంట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో పక్షం రోజులుగా వర్షాలు లేకపోవడంతో వరి నారుమడులు ఎండిపోతున్నాయి. మొన్నటి వరకు ముసురు పెట్టడంతో రైతులు ఆనందంతో వరి నారును వేశారు. ఇంతలోనే వారం రోజులుగా భగ భగ మండే ఎండలు కాయడంతో నారుమడులు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 24 పంచాయతీల్లో 1300 హెక్టార్లకు సంబంధించి సరిపడా వరి నారును రైతులు వేశారు. కాగా కొద్ది రోజులుగా వర్షం లేకపోవడంతో వేసి వరి నారుమడులు ఎండిపోతున్నాయి. మండలంలోని రోలుగుంట, కొమరవోలు, కుసర్లపూడి, రత్నంపేట, శరభవరం, కె.నాయుడుపాలెం, అడ్డసరం తదితర గ్రామాల్లో రైతులు బావులు, చెరువుల నుంచి మోటార్ల ద్వారా నీటిని తోడుతూ వరినారును తడుపుతున్నారు. నీటి ఇంజిన్లను అద్దె ప్రాతిపదికన తెచ్చుకుని తీవ్ర వ్యయప్రయాసలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 31 మద్యం సీసాల స్వాధీనం

నక్కపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చిరాజుపేట గ్రామంలో ఆదివారం ఎస్ఐ సన్నిబాబు నేతృత్వంలో సిబ్బంది మద్యం బెల్టు షాపుపై దాడులు నిర్వహించారు. డి.అనంతరావుకు చెందిన దుకాణంలో 31 మద్యం సీసాలు లభ్యమయ్యాయి. వీటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ సన్నిబాబు చెప్పారు. మద్యం అక్రమంగా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.



నాతవరంలో అభివృద్ధి పనుల కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

## 'కూటమి ప్రభుత్వంలో సుపరిపాలన'

నాతవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నదని టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ పేర్కొన్నారు. మండల కేంద్రం నాతవరంలో ఆదివారం కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా నందిపల్లి వెంకటరమణ మాట్లాడుతూ పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిల్‌యాక్టు రద్దు, తల్లికి వందనం తదితర పనుల గురించి ప్రజలకు వివరించారు. అలాగే జూలై 18న అన్నదాత సుఖీభవ, ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, సీనియర్ నాయకులు అపిరెడ్డి మాణిక్యం, ఇటంశెట్టి సీతారామ్మూర్తి సుర్ల నాగబాబు, ఐటీడీపీ ఇన్‌చార్జ్ శెట్టి గోపీ, చింతకాయల శ్రీనివాసు, పైల రామునాయుడు పాల్గొన్నారు.

## టీడీపీ మండల అధ్యక్షుడిగా ముచ్చకర్ల



సత్యనారాయణ

బుచ్చెయ్యపేట, జూలై, (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా ఎంవీవీ సత్యనారాయణ నియమితులయ్యారు, ఆయన గతంలో ఎంపీపీగా సేవలు అందించారు. సీనియర్ నాయకులుగా కొనసాగుతున్న ఆయన, మండల పరిశీలకులు అద్దెపల్లి జగ్గారావు సమక్షంలో కార్యకర్తల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## 'నల్లరాయి క్వారీల్లో అక్రమ వసూళ్లు'

నర్సీపట్నం అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నియోజకవర్గంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు దోపిడీ చేస్తున్నారని, నల్లరాయి క్వారీల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్ ఆరోపించారు. పెద బొడ్డేపల్లిలోని వైసీపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ వైసీపీ విస్తృతస్థాయి సమావేశం జరగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు లేటరైట్, మరోపక్క నల్లరాయి క్వారీలు, ఇసుక క్వారీల్లో అయ్యన్నకు భారీ ముడుపులు అందుతున్నాయని ధ్వజమెత్తారు. జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ మాట్లాడుతూ రోలుగుంట నల్లరాయి క్వారీల్లో టన్నుకు రూ.250 రూపాయలు చొప్పున అయ్యన్న అనుచరులు ముడుపులు వసూళ్లు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ, వైసీపీ నాయకులు ఎర్రాపాత్రుడు, సన్యాసిపాత్రుడు, సుబ్బలక్ష్మి, ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## మాకవరపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా చినబాబు



చైర్మన్ చినబాబు

మాకవరపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా గిడుతూరు మాజీ సర్పంచ్ శీరంరెడ్డి నాగ వెంకట చినబాబును ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వంలో నియమించిన బోర్డు సభ్యులను కూటమి తొలగించింది. ఈ నేపథ్యంలో కొత్త కమిటీలో చైర్మన్‌గా చినబాబుతో పాటు డైరెక్టర్లుగా రాచపల్లి బీజేపీ నేత అడిగర్ల రాబాబు, తాడపాల టీడీపీ నేత గనిశెట్టి శంకరరావును నియమించినట్టు పీఏసీఎస్ సీఈవో భూషణరావు తెలిపారు.

## రేషన్ బియ్యం పట్టివేత

కె.కోటపాడు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం కొనుగోలు చేసి వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నామని ఎస్ఐ ఆర్.ధనుంజయ తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులకు కేసు వివరాలు వెల్లడించారు. మండలంలో గుల్లిపల్లి గ్రామంలో ప్రజల వద్ద వ్యాన్ డ్రైవర్ బూరా నాగేశ్వరరావు కొనుగోలు చేసి బస్తాలుగా మార్చారు. ఈ బస్తాలను వ్యాన్‌లో లోడ్ చేసి తరలించే క్రమంలో కోటపాడు పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఈ బస్తాలను శనివారం రాత్రి పది గంటల సమయంలో పట్టుకున్నామని చెప్పారు. వ్యాన్‌లో బియ్యం లోడు సుమారు రెండు టన్నులు ఉంటుందని అంచనాగా చెప్పారు. కేసు నమోదు చేసి డ్రైవర్‌ను, బియ్యంతో ఉన్న వ్యాన్‌ను సీజ్ చేశామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

## కేశవస్వామి ఆలయంలో అన్న సమారాధన



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

చోడవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవస్వామి ఆలయంలో ఆదివారం భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు, శివాలయం కమిటీ చైర్మన్ గూనూరు సురేశ్, జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, భక్త బృందం బ్యాంకు రాము, ఉపాధ్యాయుల శ్రీనివాస్, కోనేటి రాజు, కృష్ణారావు, తాతాజీ, వీరభద్రరావు, సుధాకర్, బుజ్జి, సత్యారావు, ప్రసాదరావు, భూలక్ష్మి, వసంత, వందన, లక్ష్మీ, సత్యమణి ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు.